క్లుప్తంగా

ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామానికి చెందిన వడ్ల బ్రహ్మచారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో దశదినకర్మల నిమిత్తం కాంగ్రెస్ నాయకులు రూ.10,500ల ఆర్థికసాయానికి సంబంధించిన నగదును మృతుడి కుటుంబ సభ్యులకు బుధవారం అందించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ తైదా పర్వతాలు, కోడూరు రాములు, శ్రీశైలం, రవీందర్‌గౌడ్, నర్సింలు, నరేందర్‌రెడ్డి, భీమయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీకి వంట సామగ్రి అందజేత



టీచర్‌కు వంట సామగ్రి అందజేస్తున్న మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పుష్పలత

మొయినాబాద్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఆటపాటలతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారని కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా కార్యదర్శి పుష్పలత అన్నారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు కావాల్సిన వంట సామాన్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌కుమార్‌ను బుధవారం పట్టణ రియల్ ఎస్టేట్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, కబీర్ అహ్మద్, హైదర్‌గోరి, అజ్మత్, శంకర్‌నాయక్, అంజద్ గోరి, వెంకటేశ్, తాహేర్, జలాల్‌గోరి, ఇబ్రహీం, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

షాబాద్: ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మండలంలోని కుర్వగూడ గ్రామానికి చెందిన బయ్యని శివకుమార్‌కు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డితో కలిసి ఆయన అందజేశారు. కార్యక్రమంలో మల్లారెడ్డిగూడ మాజీ సర్పంచ్ జంగయ్య, బయ్యని భాస్కర్‌గౌడ్, యాదయ్య తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న విష్ణు, గ్రామస్తులు

షాబాద్: మండలంలోని సర్దార్‌నగర్ గ్రామంలో ఉన్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు విష్ణు కోరారు. బుధవారం సర్దార్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులతో కలిసి కార్యదర్శి విజయ్‌కుమార్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్దార్‌నగర్ గ్రామంలో వీధికుక్కల బెడద ఎక్కువైందని, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగటంతో దోమలు, ఈగలతో వ్యాధుల బారిన పడుతున్నామన్నారు. గ్రామంలో చెత్త చెదారాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట గ్రామస్తులు నరేశ్, రాజు, సురేశ్, కృష్ణ, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

ఇంకెన్నాళ్లు?

- వృథాగా డబుల్ బెడ్రూంలు
- ఎంపిక చేసి లబ్ధిదారులకు కేటాయించడంలో జాప్యం
- సొంతింటి కోసం ఆశగా ఎదురుచూపు



నందిగామలో వృథాగా ఉన్న డబుల్ ఇళ్లు

నందిగామ: డబుల్ బెడ్రూం ఇళ్ల జాబితాలో లబ్ధిదారులుగా ఎంపిక చేశారు.. లక్కీ డ్రాలో గదుల నెంబరును కేటాయించారు.. త్వరలోనే సొంతింటి కల నెరవేరబోతుందని సంబరపడ్డారు లబ్ధిదారులు. కానీ 15 నెలలు గడుస్తున్నా కూడా నేటివరకు డబుల్ ఇళ్లు అందివ్వకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన నందిగామలో నిర్మించిన డబుల్ ఇళ్ల పరిస్థితి ఇదీ.

కోట్లు ఖర్చు చేసి..

నిరుపేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మండల కేంద్రమైన నందిగామలో పాత జాతీయ రహదారి పక్కన సర్వే నెం.1414లో సుమారు 1 ఎకరా 19 గుంటల్లో టీఎస్‌హెచ్‌సీఎల్-పీఎంఏవై నిధులు రూ.6 కోట్ల 4లక్షల 80వేల వ్యయంతో 4 బ్లాక్‌లలో 120 డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించారు.

లక్కీ డ్రా తీసి 15 నెలలు గడుస్తున్నా..

డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం మండల కేంద్రమైన నందిగామ నుంచి 429 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో నుంచి 21 మంది డబుల్ ఎంట్రీ చేశారని అధికారులు అప్పట్లో వారి పేర్లను తొలగించారు. మిగతా 408 మంది దరఖాస్తు దారులలో సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి 120 మందిని ఎంపిక చేశారు. ఎంపిక చేసిన వారిలో 100 మందికి 2023 మే 4వ తేదీన లక్కీ డ్రా ద్వారా ఇంటికి సంబంధించి నెంబర్లను కేటాయించారు. మిగతా 20 మంది లబ్ధిదారులకు సంబంధించి దరఖాస్తులను పునఃపరిశీలిస్తామని అప్పట్లో అధికారులు చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ ఒత్తిళ్లకు గురైన అధికారులు కొంతమంది అనర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించారని, దీంతో అర్హులు అన్యాయానికి గురవుతున్నారని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి.

హడావిడిగా ప్రారంభం..

ఎన్నికలకు ముందు ఎన్నికల కోడ్ వస్తుందనే పుకార్ల నేపథ్యంలో గతేడాది అక్టోబర్ 5న అప్పటి మంత్రి కేటీఆర్ షాద్‌నగర్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసే సమయంలో మండల కేంద్రమైన నందిగామలో డబుల్ బెడ్రూం ఇళ్ల శిలాఫలకాన్ని ప్రారంభించారు.

ఎదురుచూపు

లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్లను ఎప్పుడు అందజేస్తారోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నిరుపేదలమైన తమకు కనీస గూడు లేకపోవడంతో డబుల్ బెడ్రూం ఇళ్లు వస్తాయని ఆశతో ఎదురుచూశామని, లక్కీ డ్రాలో తమకు ఇళ్లు కేటాయించి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఇళ్లు స్వాధీనం చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి సుమారు 18 నెలలు కావస్తున్నా కూడా నేటివరకు వృథాగానే ఉన్నాయి. దీంతో ఆ ఇళ్లు శిథిలావస్థకు చేరడమే కాకుండా పరిసర ప్రాంతల్లో చెట్లు, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా అసాంఘిక కార్యాకలాపాలు సైతం చోటు చేసుకునే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు వీలైనంత తొందర్లో ఇళ్లు అందజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇబ్బంది పడుతున్నాం..



ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అసలే వర్షాలు కురుస్తున్న ప్రస్తుత నేపథ్యంలో ఎక్కడ తలదాచుకోవాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే తమకు ఇళ్లు అందజేయాలి.

- జంగారి లక్ష్మి, నందిగామ

తమకు ఇళ్లు ఇవ్వాలి



లక్కీడ్రాలో తమ పేరును తీసి 15 నెలలు గడుస్తున్నా కూడా నేటివరకు ఇళ్లు ఇవ్వడం లేదు. సొంత ఇళ్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నాం. కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నాం. ప్రతి నెల అద్దె చెల్లించలేక అల్లాడిపోతున్నాం. అధికారులు స్పందించి త్వరగా తమకు ఇళ్లు ఇవ్వాలి

- సోమ గీత, నందిగామ

ఆదేశాలు రాలేదు

డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ఉన్నతాధికారుల ఆదేశానుసారంగా జరుగుతుంది. ఉన్నతాధికారుల నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. త్వరలోనే ఆదేశాలు అందే అవకాశం ఉంది. గతంలో ఎంపిక చేసిన వారికి ఇవ్వాలా లేక మళ్లీ లబ్ధిదారులను ఎంపిక చేయాలా అనేది ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే లబ్ధిదారులకు అందజేస్తాం.

రాజేశ్వర్, తహసీల్దార్, నందిగామ

తల్లిపాలే బిడ్డకు రక్ష

సీడీపీఓ నాగమణి



షాద్‌నగర్‌రూరల్: తల్లిపాల అవశ్యకతను వివరిస్తున్న సీడీపీఓ నాగమణి

షాద్‌నగర్‌రూరల్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రీరామ రక్ష అని, పుట్టిన అరగంటలోనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని సీడీపీఓ నాగమణి అన్నారు. చించోడ్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలోని ఇంద్రానగర్ హెల్త్ సెంటర్‌లో బుధవారం డాక్టర్ షేక్‌ముస్తఫాకిన్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ నాగమణి హాజరై మాట్లాడుతూ.. తల్లిపాలు బిడ్డలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయన్నారు. పుట్టిన బిడ్డకు మూడు సంవత్సరాల వరకు తల్లిపాలను పట్టించాలని సూచించారు. తల్లీబిడ్డల క్షేమం కోసమే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ షేక్‌ముస్తఫాకిన్, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ, ఏఎన్‌ఎంలు రమాదేవి, శిరీష, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వెంకటమ్మ, విజయలక్ష్మి, సంధ్య, టీచర్లు పద్మావతి, సుగుణ, నాగేశ్వరి, భారతమ్మ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

రోగనిరోధక శక్తిని పెంచుతాయి

షాబాద్: పుట్టిన పిల్లలకు తల్లిపాలు పట్టించటంతో వారిలో రోగనిరోధకశక్తి పెరుగుతుందని మక్తగూడ అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని మక్తగూడ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలింతలు, గర్భిణులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలన్నారు. ముర్రుపాలు బిడ్డకు అన్ని విధాలుగా రక్షణ కల్పించేలా పనిచేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గర్భిణులు, మహిళలు తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లి గ్రామంలో ఏబీవీ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ.. వైద్యులు దేవుళ్లతో సమానమన్నారు. ఆపద సమయంలో ఎంతో మంది పేద ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వస్తుంటారని, అలాంటి వారికి వైద్యులు భరోసా కల్పించి వైద్యాన్ని అందించాలన్నారు. రోగులకు మనోధైర్యాన్ని నింపాలన్నారు. వారికి సేవా దృక్పథంతో వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్, డాక్టర్ భార్గవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, కావలి శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ సింగారం సుదర్శన్, కృష్ణ, నవీన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం

మున్సిపల్ కమిషనర్ వెంకన్న



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకన్న

షాద్‌నగర్‌రూరల్: మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద నేరమని మున్సిపల్ కమిషనర్ వెంకన్న అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ షాద్‌నగర్ ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నిర్మూలనపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతిరోజు ఎంతో మంది మహిళలు, అమ్మాయిలు అక్రమ రవాణా బారిన పడుతున్నారని, ప్రధానంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు ఉద్యోగం, ప్రేమ వివాహం, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారన్నారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ తమ పరిధిలోని మహిళలు, అమ్మాయిలకు అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సీడీపీఓ నాగమణి మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా సమస్యను నిర్మూలించేందుకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించి అప్రమత్తం చేయాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ, మున్సిపల్ మేనేజర్ నయీమ్ పాషా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అండాలు, సంధ్య, విజయలక్ష్మి, ప్రజ్వల ప్రతినిధులు సురేశ్‌కుమార్, అనిల్‌కుమార్, మిథాలిరాజ్, అంగన్‌వాడీటీచర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద దంపతులపై దాడి సరికాదు

జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదు



చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

చేవెళ్ల: జనగాం పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాద దంపతులపై జరిగిన పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. చేవెళ్ల కోర్టులో బుధవారం విధులను బహిష్కరించి ర్యాలీగా చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులపైన చర్యలు తీసుకోవాలని, వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులపై దాడులు చేయటం సరికాదన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోకపోతే న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాక్షుడు గౌతమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.సత్యానందం, సంయుక్త కార్యదర్శి తాజుద్దీన్, సభ్యులు జనార్దన్, గోపాల్, ముక్తర్‌షరీఫ్, రోజారెడ్డి, యాదగిరిగౌడ్, ఈశ్వరయ్య, రవీందర్, శ్రీధర్, శివరాజ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



నర్సరీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, తదితరులు

శంకర్‌పల్లి: రాజకీయాలకతీతంగా ప్రతిఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం మున్సిపాలిటీలో మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, చైర్‌పర్సన్ విజయలక్ష్మీతో కలిసి ఆయన పర్యటించారు. మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన పట్టణ నర్సరీని, అనంతరం బుల్కాపూర్‌లో సీసీరోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయాలు ఎన్నికల వరకే అని, అభివృద్ధిలో అంతా ఏకం కావాలన్నారు. మాజీ ఎంపీ మాట్లాడుతూ.. శంకర్‌పల్లి శరవేగంగా వృద్ధిలోకి వస్తోందని, దీన్ని మరింత ముందుకు తీసుకొని వెళ్లేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలో చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటి, నీరు పోశారు. మురుగునీటి కాల్వలు, గుంతల్లో మట్టివేసి పూడ్చడం వంటి కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు సమన్యాయం

ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి



కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేద ప్రజలకు సముచిత న్యాయం జరుగుతుందనే నమ్మకం ప్రతి ఒక్కరికి ఉందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం మండలంలోని రామన్నగూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లావణ్యశంకర్ దంపతులు, వారితో పాటు గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి వారు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలుచేసి తీరుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే విధంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, నాయకులు వసంతం, కృష్ణారెడ్డి, ఆగిరెడ్డి, నరేందర్, జనార్దన్, దామోదర్‌రెడ్డి, మాణిక్యం తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఎంపీడీఓ సంధ్య



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని ఎంపీడీఓ సంధ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి, జీవన్‌గూడ, బాకారం, అజీజ్‌నగర్ గ్రామాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఎన్కెపల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. జీవన్‌గూడలో విద్యార్థులకు సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా ఇంకా రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమాలను గ్రామాల్లో అధికారులు రోజువారీ పనులను నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సన్మానం



చేనేత కార్మికులను సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సంఘం భవనంలో బుధవారం చేనేత కార్మికులను శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కోట జనార్దన్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత ప్రధాన భూమికను పోషించిందన్నారు. మహాత్మా గాంధీ రాట్నంపై నూలు వడకడానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారని గుర్తుచేశారు. అలాంటి ప్రాధాన్యత కలిగిన చేనేతకు ఒక రోజు ఉండాలనే ఆలోచనతో ఆగస్టు 7న చేనేత దినోత్సవముగా ఏర్పాటు చేశారన్నారు. చేనేత వస్త్రాలను ఆదరించి నేతన్నలను ఆదుకునేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నరహరి, చిన్నయ్య, బుచ్చయ్య, అంజయ్య, విశ్వనాథం, రాజేందర్, చెన్న బాల్‌రాజ్, భాస్కర్, జంగయ్య, అంజయ్య, రాములు, రాజు, హరికుమార్, శివ, రమేశ్, బాలకృష్ణ, రాములు, పాండురంగం, రమేశ్, మల్లేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతో సంపూర్ణ ఆరోగ్యం

- మూడోరోజు కొనసాగిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు
- పాల్గొన్న అధికారులు, మున్సిపల్ సిబ్బంది



షాద్‌నగర్‌రూరల్: ఎలికట్టలో డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ బన్సీలాల్



కొత్తూరు: విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న చైర్‌పర్సన్ లావణ్య

షాద్‌నగర్‌రూరల్: పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట, ఎల్లంపల్లి గ్రామాలను ఎంపీడీఓ బన్సిలాల్ సందర్శించారు. ఈ సందర్భంగా డంపింగ్‌యార్డు, నీటి ట్యాంకులు, మురుగు కాల్వలు, సీసీరోడ్లు, ఇంకుడు గుంతలను పరిశీలించారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తేజస్విని, ఉపాధిహామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ సత్తయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో..

కౌన్సిలర్ శాంతమ్మ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో గల కాలనీల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, కంప చెట్లను తొలగించారు. అనంతరం శాంతమ్మ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ద్వారా ఏర్పాటు చేసిన చెత్త బండిలో తడి, పొడి చెత్తను వేరుచేసి వేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో గంగిరెడ్డి, సుధీర్, నవాజ్, మహిపాల్‌రెడ్డి, జగన్, వాసు, శ్రీశైలం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీకి సహకరించాలి

కొత్తూరు: జిల్లాలోనే కొత్తూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, వ్యాపారులు తమవంతు సహకారం అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య కోరారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆమె బుధవారం ఆయా శాఖలకు చెందిన అధికారులతో కలిసి పట్టణ సమీపంలోని కొశన్నకుంట చెరువును పరిశీలించారు. చెరువులో పెరిగిన కంపచెట్లు, పూడిక తదితర సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలని ఇరిగేషన్ శాఖ అధికారులను సూచించారు. అనంతరం స్వచ్ఛత, పచ్చదనంపై విద్యార్థులకు నిర్వహించిన రాత పరీక్షలో ప్రతిభ కనబర్చిన వారికి ఆమె బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ..ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములుగా కావాలని కోరారు. అంతేకాకుండా తమ వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, నాయకులు దేవేందర్‌యాదవ్, ఇరిగేషన్ ఏఈ రవీందర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.